క్లుప్తంగా

ఏజెన్సీ చట్టాలను పరిరక్షించాలి

ఏటూరునాగారం: ఏజెన్సీ చట్టాలను పరిరక్షించాలని తుడుందెబ్బ జిల్లా ఇన్‌చార్జ్ ఎట్టి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో కొందరు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఉన్న అధికారులు చట్టాలకు లోబడి భూములను కేటాయించారని, ప్రస్తుత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

యూనిఫాం పంపిణీ



వాజేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫాంలను మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో వెంకటేశ్వర్లు సోమవారం అందించారు. వీటితో పాటు పిల్లల్లో ఏర్పడే పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు దోహదపడే రాగి జావ, బెల్లంను అందించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిని విద్యార్థులకు అందించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మంగపేట: మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన గంపల ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిశ నాగరమేష్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 4వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన వడ్లకొండ నాగయ్య మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బాడిశ నవీన్, ఆదినారాయణ, వీరస్వామి, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ పనులు ప్రారంభం



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయ ప్రాకారగోడ పునర్నిర్మాణ పనులను కేంద్ర పురావస్తుశాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. గతంలో తూర్పు, దక్షిణం వైపు గల ప్రాకార గోడను తొలగించి పునర్నిర్మించారు. ప్రస్తుతం తూర్పు, ఉత్తరం మధ్య గల ప్రాకారగోడను క్రేన్ సహాయంతో తొలగిస్తున్నారు. 15 రోజుల పాటు ప్రాకార గోడ పనులు జరగనున్నట్లు పురావస్తుశాఖ అధికారులు వెల్లడించారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

కాటారం: బహుజన రాజ్యాధికార సాధనే బీఎస్పీ అంతిమ లక్ష్యం అని ఆ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనగామ రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు రామిల్ల రాకేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ బీఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ బీఎస్పీ పార్టీ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. బహుజనులకు భరోసా కల్పిస్తూ బీసీలకు 70 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి అసెంబ్లీకి పంపించేలా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మండల వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ మౌలానా, కాటారం సెక్టార్ అధ్యక్షుడు బీరెల్లి మహేశ్, దామెరకుంట సెక్టార్ అధ్యక్షుడు కోడిపల్లి సంధన్, అజయ్, లచ్చయ్య ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నీలం వేణు తన సోదరి కలికోట సుష్మను ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొర్లకుంట సమీపంలోకి బండిపైన ఉన్న బ్యాగ్ జారిపోవడంతో దానిని పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తు సుష్మ కిందపడి తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు వెంటనే భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వెంకటాపురం(కె): లో..



మంగపేటలో..



వెంకటాపురం(ఎం)లో..



ములుగు రూరల్: దేవగిరిపట్నంలో..



మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం



ఏటూరునాగారం: చిన్నబోయినపల్లెలో మొక్కను నాటుతున్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి



ఎస్ఎస్‌తాడ్వాయి లో..



వాజేడులో..

ఏటూరునాగారం: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని జెడ్పీసీఈఓ ప్రసూనరాణి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోగుపల్లి, శివాపురం, చిన్నబోయినపల్లి గ్రామాల్లో ఆమె మొక్కలు నాటి టీగార్డులు అమర్చారు. అనంతరం గ్రామాల్లో హరిత ర్యాలీ నిర్వహించి మొక్కల వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు సమీపంలో హరితోత్సవంలో భాగంగా సోమవారం ఎంపీపీ విజయ మొక్కలను నాటి మాట్లాడారు. నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు తప్పకుండా ఇంటి ఆవరణంలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం చెల్పాక, రొయ్యూర్, శంకరాజుపల్లి, కొండాయి, ముళ్లకట్ట, రాంనగర్, రామన్నగూడెం, షాపెల్లి గ్రామాల్లో హరితోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఈజీఎస్ ఏపీఓ, ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. తెంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో హరితోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి నీరు పోశారు. మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ ఆవరణంలో తహసీల్దార్ నాగరాజు, అటవీ శాఖ అధికారి చంద్రమౌళి, సర్పంచ్ యామిలి మొక్కలు నాటారు. రాబోయే తరానికి మొక్కలు

ములుగు రూరల్: పచ్చదనంతో మెరిసేలా పాఠశాలను గ్రీన్ పాఠశాలలుగా మార్చుకుందామని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. ఈ మేరకు మండలంలోని దేవగిరిపట్నంలో గల గురుకుల పాఠశాలలో సోమవారం హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం కార్యక్రమం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గ్రామపంచాయతీల్లో అధికారులు మొక్కలను నాటారు. చెరుకూరు గ్రామపంచాయతీలో వాజేడు ఎస్సై రేవ అశోక్, సర్పంచ్ అనంత, పెద్దగొళ్లగూడెంలో సర్పంచ్ మేనక, వాజేడు రైతు వేదిక వద్ద నాగారం సర్పంచ్ ఆదినారాయణ, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, వ్యవసాయాధికారులు మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారం ఆదివాసీ మ్యూజియంలో తెలంగాణ హరితత్సోవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మేడారంలో ర్యాలీ నిర్వహించిన అధికారులు మ్యూజియంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రదీప్, సర్పంచ్ చిడం బాబురావు, సెక్షన్ ఆఫీసర్ లింగం, మ్యూజియం క్యూరేటర్ కుర్సం రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్‌లు మొక్కలను నాటారు. ఎస్సై రుద్రారపు హరీష్, సీఆర్పీఎఫ్ జి/39 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ అనీష్ కుమార్ మొక్కలు నాటారు.

మద్యం షాపులో చోరీ

ములుగు రూరల్ : మద్యం షాపులో చోరి జరిగిన ఘటన మండలంలోని శ్రీనగర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనగర్ సమీపంలోని శ్రీరామ వైన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.లక్ష 57 వేలు విలువ గల మద్యం, రూ.41,170 నగదు అపహరణకు గురైందన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం జీడికల్‌కు చెందిన కొలగాని మనోజ్ కుమార్ షాపుకు రెండు లేదా మూడు రోజులకోసారి వచ్చి లావాదేవిలను చూసుకుంటాడు. ఆదివారం రాత్రి యజమాని 9.30 వరకు షాపులో లెక్కలు చూసుకొని వెళ్లాడు. సోమవారం ఉదయం 10.30 నిమిషాలకు వచ్చి షాపు తెరిచి చూసే సరికి షెటర్ పైన ఉన్న రేకులు తొలగించి ఉన్నాయి. దీంతో యజమాని మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కన్నాయిగూడెం: రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమతుందని రైతు బంధు జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య అన్నారు. మండలంలోని సింగారం, ఏటూరు గ్రామాల నుంచి కాంగ్రెస్‌పార్టీకి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయంగా చూసే నాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కేసీఆర్ నేతృత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగుతు పెడుతుందని అన్నారు. ఏండ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ వలన ప్రజలకు ఏమి న్యాయం జరగలేదని అన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. కొంత మంది వ్యక్తులు బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రలోభపెట్టి కాంగ్రెస్ కండువాలు కప్పడం సిగ్గుచేటని అన్నారు. అభివృద్ధి, నాయకత్వాన్ని నమ్మిన కార్యకర్తలు మళ్లీ బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వెంకటయ్య, నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్, డ్పీటీసీలు



ఏటూరునాగారంలో..

ములుగు రూరల్: ములుగు జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీశ్ ఆకాల రమణం తమను కలచివేసిందని జెడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జిల్లా పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు జగదీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా, నియోజకవర్గానికి జగదీశ్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన అకాల మరణం జిల్లా ప్రజలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు సకినాల భవాని, గై రుద్రమదేవి, తుమ్మల హరిబాబు, పాయం రమణ, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియబీ, రియాజ్‌మిర్జా, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఆయా మండలాల అధ్యక్షులు భాదం ప్రవీణ్, సునీల్, లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, సాయిబాబు, మల్లయ్య, వేణు, సూరయ్య, సమ్మయ్య, రాంబాబు, రామక్రిష్ణరెడ్డి పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఐటీడీఏ అధికారులు

ఏటూరునాగారం: దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ 9వ రోజు కార్యక్రమాన్ని మండలంలోని మల్లంపల్లిలో నిర్వహించారు. ఐటీడీఏ అధికారులు ఆయనకు నివాళులర్పించారు. జగదీశ్ కుటుంబాన్ని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, ఏఓ దామోదర స్వామి పరామర్శించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సతీష్, కిరణ్‌కృష్ణరావు, సంతోష్, డిప్యూటీ ఎస్ఓ లాల్ ఉన్నారు.

'మీసేవ' నిర్వాహకుల దోపిడీని అరికట్టాలి

మంగపేట: బీసీ చేతి వృత్తుల రణాలకు దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారుల జేబుకు మీసేవా నిర్వాహకులు ఛిల్లు పెడుతున్నారని సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ముత్యాలు ఆరోపించారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాసుకు సోమవారం వినతిపత్రం అందించారు. కుల, ఆదాయ, నివాస పత్రాల కోసం అత్యధికంగా దరఖాస్తులు రావడంతో మీసేవా నిర్వాహకులు దరఖాస్తు దారుల నుంచి అధిక రుసుము వసూళ్లు చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 45 తీసుకోవలసి ఉండగా అదనంగా మూడు దరఖాస్తుకు రూ. 400 నుంచి రూ. 500 వరకు తీసుకుంటూ దోపిడికి పాల్పడుతున్నారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఇంటింటా సర్వే

వాజేడు: ఓటరు లిస్టు సవరణ, కొత్త ఓటరును నమోదు చేసేందుకు మండల కేంద్రంలో బీఎల్‌వోలు ఇంటింటా సర్వే చేపట్టారు. ఓటరు లిస్టులో పేర్లు, తప్పులు, నూతన ఓటర్లను నమోదు చేసేందుకు సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. మృతి చెందిన ఓటర్లను గుర్తించడంతో పాటు 18 సంవత్సరాలు నిండి ఓటరు లిస్టులో పేర్లు లేని వారి వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అధికారంలోకి వస్తే రూ. 5 లక్షలతో ఇళ్లు..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతీ ఒక్కరికి రూ. 5లక్షలతో ఇళ్లు కట్టిస్తామని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరుగగా ఆమె హాజరై మాట్లాడారు. పోరాటాలు, లాఠీ దెబ్బలకు ఓర్చుకొని సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్, టీఆర్ఎస్ నాయకులు చెప్పిన నీళ్లు, నిధులు, నియమకాల వాగ్దానం ఎందుకు నెరవేరడం లేదని ప్రశ్నించారు. ధరణి పోర్టల్ కేవలం ధనికులకు, పెత్తందారులకు మాత్రమే ఉపయోగపడుతుందని, చిన్న, సన్నకారుల రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఏ మేరకు అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవెర్చకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో వేడుకలు నిర్వహిస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు అవస్థలు పడుతుంటే రైతు వారోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, పోడు పట్టాలు, రైతు రుణమాఫీ, ఎస్టీలు, మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్ తదితర హామీలను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ సర్కార్ ధనికుల ప్రయోజనాల కోసం పనిచేస్తుంటే, రాష్ట్రంలో కల్వకుంట్ల ఫ్యామిలీ దోచుకొని దాచుకుంటుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తెలంగాణలో నిజమైన అభివృద్ధి అప్పుడు మొదలవుతుందన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రూ. 500లకే గ్యాస్‌సిలెండర్, నిరుపేదలైన వారికి రూ. 5 లక్షలతో ఇంటి నిర్మాణాలు తదితర ప్రజాప్రయోజనాల పథకాలకు శ్రీకారం చుడుతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ధరణి పోర్టల్‌ను రద్దు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గడపగడపకు వెళ్లి వివరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, భిక్షపతి, షకీల్, కంబాల రవి, ఆకుతోట చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ములుగుగు: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు: మున్నురుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ ఏడాది రూ. 5 కోట్ల నిధులు కేటాయించాలని సంఘం జిల్లా కన్వీనర్ పిట్టల మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులతో కలిసి సోమవారం అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్, ఆర్డీఓ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రోకర్‌లకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో మున్నురుకాపులు అత్యధికంగా పేద, మధ్యతరగతికి చెందిన వారున్నారని, వ్యవసాయ వృత్తిపై ఆదారపడి జీవిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు హాస్టల్ భవనాలను నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బలరాం, భిక్షపతి, ఐలయ్య, చంద్రమౌళి, రవీందర్, రాజు, శ్రీధర్, శ్రీను, చంద్ర ప్రకాష్, కిరణ్, విజేందర్, మధు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ సలీంకు వినతిపత్రం అందించారు.

వెంకటాపురం(కె): మున్నూరుకాపు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి కాపుబంధు పథకాన్ని అమలు చేయాలని ఆ సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు.

వాజేడు: మున్నూరు కాపులకు ప్రభుత్వం న్యాయం చెయ్యాలని కోరుతూ ఆ సంఘం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజుకు వినతిపత్రం అందించారు.

మంగపేట: ప్రభుత్వం మున్నురుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సుదర్శన్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు.

'పెసా' గ్రామ సభలు రద్దు చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మంగపేట: గిరిజనేతర గ్రామాల్లో పెసా గ్రామ సభలు రద్దు చేయాలని మండలంలోని రమణక్కపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950 సంవత్సరానికి ముందు నుంచి రమణక్కపేటలో బీసీ, ఓసీ, ఎస్సీలు నివసిస్తున్నారని ఇటీవల కాలంలో కొంత మంది గిరిజనులు గ్రామానికి వలస వచ్చారని తెలిపారు. నిబంధనల మేరకు 50శాతం గిరిజన జనభా ఉన్న గ్రామాల్లో మాత్రమే పెసా సభలు నిర్వహించాలని, కానీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మంచర్ల మురళీకృష్ణ, కోటేశ్వర్‌రావు, విష్ణుమూర్తి, చందర్‌రావు, మల్లికార్జున్‌రావు, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు

కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ



ఏటూరునాగారం: కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు: దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. భారతదేశం సస్యశ్యామలంగా ఉండాలని కోరుకునే నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్న పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆమె కోరారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 150 రోజుల పాటు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని ఓ శక్తిగా మార్చిన నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. జిల్లా, మండల, గ్రామ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: కాంగ్రెస్ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల అధ్యక్షుడు చిటమట రఘు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వావిలాల నర్సింగరావు, ఎల్లయ్య, బాలరాజు, సులేమాన్, శ్రీనివాస్, రమేష్, నవీన్, రాజు, శ్రీను, గౌస్ పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): కాంగ్రెస్ పార్టీ అగ్రతనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సీతక్క తనయుడు ధనసరి సూర్య హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, బెరెడ్డి భగవాన్‌రెడ్డి, అయిలయ్య, శ్రీనివాస్, రవి, రాజిరెడ్డి, కోటి, జాకీర్, రమేష్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని లక్ష్మీదేవిపేటలో యూత్ కాంగ్రెస్ నాయకులు చిర్ర హరీష్, కొండ తిరుపతి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు.

జాగ్రత్తలు పాటించాలి

వాజేడు: ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మాతా శిశు సంరక్షణ వైద్యాధికారి క్రాంతి సూచించారు. మండలంలోని ఇప్పగూడెం, సుందరయ్య కాలనీ గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి గర్భిణులతో పాటు బాలింతలను పరిక్షించి మందులు పంపిణీ చేశారు. చంటి పిల్లలకు ప్రత్యేక పరిక్షలను నిర్వహించారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రక్తనమూనాలను సేకరించారు.